క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: ఇల్లందు పట్టణంలోని ముకార్తా పాపాన్న ప్రాంగణంలో గల బాలాజీ కమ్యూనిటీ హాల్లో ఈ నెల 23 ఆదివారం జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కొత్త బస్టాండ్ సమీపంలో ఐఎఫ్టీయూ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు కార్మికులు, విద్యార్థులు, ఐఎఫ్టీయూ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, డివిజన్ అధ్యక్షులు రమేశ్, మండల అధ్యక్షులు సాయిసుమన్, నాయకులు తిరుపతి, సంపత్, కాంతయ్య, సమ్మయ్యలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ కార్యాలయాల్లో నాల్గో తరగతి ఉద్యోగుల పాత్ర కీలకమని, అధికారుల మేరకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల జిల్లా తరుపున జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్, ప్రధాన కార్యదర్శి కమ్మల గోవర్ధన్‌తో జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గుర్తింపు లేని పాఠశాల కరపత్రాలు దహనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాల కరపత్రాలను బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు దహనం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నడుపిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులు తమ పాఠశాలలో అమ్ముతున్న షూ, బెల్ట్, నోట్ బుక్స్, టై, యూనిఫాం కొనుగోలు చేయాలని ముందే షరతులు విధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జుమ్మిడి గోపాల్, జాగిరి రాజేష్, బచ్చలి ప్రవీణ్‌కుమార్, షేక్ సల్మాన్ పాష, చేరాల వంశి, పూరెళ్ల సతీష్, నస్పూర్ అఖిల్, జాడి నరేందర్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు సహకరించాలి

బెల్లంపల్లిరూరల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తమ్మడి ఎవంజలీన్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం విద్యాశాఖ అధికారులు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండాజోల్ మాత్రల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రభాకర్, హెచ్ఈవో సమ్మయ్య, ఆయా కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ

జైపూర్: కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు నిందితులు కోర్టుకు హాజరుకాని ముద్దాయిలకు చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జీ రవి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లుగా జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఇందారం గ్రామానికి చెందిన పయ్యావుల సంతోశ్, శ్రీరాంపూర్‌కు చెందిన మహ్మద్ మున్నా అనే ఇద్దరు నిందితులకు బుధవారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లుగా తెలిపారు.

కళాకారులను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న కళాకారులు

జన్నారం: తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన కళాకారులు ఇప్పుడు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని, ప్రభుత్వపరంగా కళాకారులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఉట్నూర్‌లోని తన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఏర్పాటులో కీలకంగా ఉన్న కళాకారులు నేడు ఇళ్లు లేక, ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలని కోరారు. కళాకారులు ఆదర్శ కళాసమితి అధ్యక్షుడు రాజలింగు, నర్సయ్య, రాజునాయక్, రాజన్న పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



మాట్లాడుతున్న జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్

శ్రీరాంపూర్: జిల్లాలోని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని మంచిర్యాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని సింగరేణి వీటీసీలో బుధవారం ప్రపంచ సికిల్ సెల్ డే సందర్భంగా రక్తదానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో వీటీసీ మేనేజర్ రామారావు, హెడ్ ఓవర్‌మెన్లు రాజ్‌కుమార్, రవీందర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శంకర్ వర్మ, కాసర్ల రంజిత్ పాల్గొన్నారు.

దండేపల్లి: సికిల్‌సెల్‌ను నిర్మూలించాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ కోరారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ సికిల్‌సెల్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సికిల్ ఎలా వస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ వైద్యుడు సతీష్ వివరించారు. అనంతరం సికిల్‌సెల్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం శంకర్‌గౌడ్, ఎంపీటీసీలు శ్రీనివాస్, రాజన్న, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల: గ్రామీణ ప్రాంత ప్రజలకు సికిల్‌సెల్ ఎనిమియాపై మరింతగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ సిబ్బందికి సూచించారు. ప్రపంచ సికిల్ సెల్ డే సందర్భంగా బుధవారం కుశ్నపల్లి, చిత్తాపూర్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ నారాయణ, ఏఎన్ఎం ఇందిరా, ల్యాబ్ టెక్నీషియన్ సుధీర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి: ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటపల్లి కస్తూర్బా ఎస్‌వో హరిత ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తలసేమియా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు రిలీవ్ లెటర్‌లు అందిస్తున్న హెచ్ఎం రామన్న

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలుగు పండిట్‌లుగా విధులు నిర్వహిస్తూ స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కే.అరుణ, ఎస్. పద్మావతిలకు తోటి ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. కే.అరుణ దండేపల్లి జెడ్పీ హెచ్ఎస్, ఎస్. పద్మావతి దండేపల్లి మండలం వెలనూర్‌కు బదిలీ కాగా వీరికి బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు అభినందించి వారికి వీడ్కోలు పలికారు. హెచ్ఎం రామన్న బదిలీ అయిన ఉపాధ్యాయులకు రిలీవ్ లెటర్‌లు అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రధర్‌రావు, రాజు, రజని, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

చెన్నూర్: మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో బుధవారం 43దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 18వార్డుల ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 1:30వరకు సాయంత్రం 2:30నుంచి 5:30వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారులు దరఖాస్తు ఫారానికి ఆధార్, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, గ్యాస్ బిల్లులు జత చేయాలని సూచించారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో గురువారం నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తు చేసుకోని వారు ఉన్నా, ఏదైనా పథకం అందకపోయినా వారు దరఖాస్తు చేసుకోవచ్చని, పాస్ ఫొటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్, గ్యాస్ బిల్లుల జిరాక్స్ కాపీలను జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ మోహన్

శ్రీరాంపూర్: కాలనీల్లో, కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్ తెలిపారు. శ్రీరాంపూర్ పోలీసులు ఆర్కే 6 కొత్త రోడ్‌లో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కాలనీలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే ఎవరినీ సహించమన్నారు. అలాంటి సమాచారం ఏదైనా ఉంటే పోలీసులకు చేరవేయాలన్నారు. దొంగతనాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు రూపుమాపచ్చన్నారు. కాలనీలో కొత్తవారు వచ్చినా, అపరిచితులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్: గ్రామాల్లోని గృహాలు, వాణిజ్య వ్యాపార సముదాయాల వారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సూచించారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకుశం గ్రామంలో బుధవారం స్థానికులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బెల్లంపల్లి/మందమర్రిరూరల్/తాండూర్/బెల్లంపల్లి/లక్సెట్టిపేట/జన్నారం/చెన్నూర్/కాసిపేట/పాతమంచిర్యాల/మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ అధినేత, ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఊరూరా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని, భావిభారత ప్రధానిగా రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని పలువురు పేర్కొన్నారు. మందమర్రి సింగరేణి హైస్కూల్ ఆవరణలోని మనోవికాస పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరై కేక్ కట్ చేశారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

వేలం వాయిదా

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ మేకల మార్కెట్, తై బజార్‌ల వేలం వాయిదా పడినట్లు కమిషనర్ చిట్యాల సతీష్, చైర్మన్ సురమిల్ల వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, చైర్మన్‌ల అధ్యక్షతన నిర్వహించిన మేకల మార్కెట్ వేలానికి నలుగురు పాల్గొన్నారని వారిలో ఎవరూ పాట పాడలేదని, అదే విధంగా తై బజార్ వేలమునకు ఇద్దరు పాల్గొన్నారని మెజారిటీ లేనందునా వేలం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి వేలం తేదీని త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

నేడు మేకలసంత వేలం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ మేకలసంత బహిరంగ వేలం గురువారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

21న మండల సమావేశం

తాండూర్: తాండూర్ మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, గౌరవ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సూపర్ బజార్ ఎన్నికల నోటిఫికేషన్

మంచిర్యాలఅగ్రికల్చర్: మమత సూపర్‌బజార్ వినియోగదారుల సహకార సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్, మంచిర్యాల పాలక మండలి ఎన్నికలకు నోటిఫికేషన్‌ను బుధవారం సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీ. సందీప్‌కుమార్ విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పాలక మండలి 9మంది సభ్యులకు గాను ఈ నెల 24నుంచి 26వరకు నామినేషన్ల స్వీకరణ, సంఘ కార్యాలయంలో స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ల పరిశీలన 27న ఉంటుందని, ఉప సంహరణ 28న ఉంటుందన్నారు. జూలై 2న పాలక మండలి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

- సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే వినోద్



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

బెల్లంపల్లి: మున్సిపల్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పాటు పడుతానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. తాను స్థానికంగా నివాసం ఉండటం లేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆగస్టులో శుభ ముహూర్తాలు మొదలుకాగానే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అందుకోసమే క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి పనులు చేయించానన్నారు. ప్రస్తుతం తాను స్థానికంగా ఉండలేకపోయిన బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం యత్నాలు చేస్తున్నానని వివరించారు. మున్సిపాలిటీలో వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని సభ్యులకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అజెండా అంశాలపై సభ్యులు చర్చించి తీర్మానాలు చేశారు. వర్షాకాలంలో దోమలు, ఈగల నివారణ కోసం మురికినీటి కాలువల్లో వేయడానికి లైమ్ ఫౌడర్ కొనుగోలు చేయాలని, దోమల వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా 4 స్ప్రేయింగ్ మేషిన్లను కొనుగోలు చేయాలని తీర్మానాలు చేశారు. మున్సిపల్ వార్డులన్నింటికి సమంగా అభివృద్ధి నిధులు కేటాయించాలని సభ్యులు ఎమ్మెల్యే వినోద్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. కాగా ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ప్రభుత్వానికి సరేండర్ చేయాలని చైర్‌పర్సన్, కొందరు సభ్యులు యత్నాలు చేయగా మెజార్టీ సభ్యులు అభ్యంతరం తెలపడంతో సరేండర్ అంశం చర్చకు రాలేదు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ సభ్యులు, అధికారులు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ బోనంతో తరలివస్తున్న భక్తులు

వేమనపల్లి: మండలానికి కూతవేటు దూరంలో ఉన్న దశవతార దైవక్షేత్రం వద్ద రాజారాం రేణుక ఎల్లమ్మ రథోత్సవ కార్యక్రమం వైభవంగా ముగిసింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు ఎల్లమ్మ తల్లికి కుడక, రైక, పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి కోళ్లు, మేకలు బలిచ్చి సంవృద్ధిగా పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుచప్పుళ్లు, డమరుక నాథాలు, శివసత్తుల పూనకాల మధ్య రేణుక ఎల్లమ్మ, గ్రామదేవతలను రథంపై ఎక్కించి గ్రామంలో రథయాత్ర నిర్వహించారు. ఒగ్గు కథాగానం పలువురిని ఆకట్టుకుంది. ఈ రథోత్సవ కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు పక్కన ఉన్న కోటపల్లి, చెన్నూర్, కన్నెపల్లి, భీమిని, నెన్నెల మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవస్థానం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

'భవిత' సేవలు సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

తాండూర్: భవిత కేంద్రం సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రం భవనంలోని భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫిజియోథెరపీ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రతీ బుధవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించనున్నట్లు నాడీ వ్యవస్థ లోపం, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న పిల్లలను భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకటేష్ పలువురు దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ వెంకటేశ్వర్లు, సతీష్, సీఆర్పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజ ర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ ఐక్యవేదిక నాయకులు చలమల అంజయ్య, బీసీ సబ్‌ప్లాన్ సమితి నాయకులు మోతే రామదాసు, మోర చరణ్, రామస్వామి, రమేష్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు!

- ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితంగా ఆధార్
- మొబైల్ నంబర్ లింక్ రూ.50 మాత్రమే..

దండేపల్లి: డిజిటల్ యుగంలో ఆధార్ కీలక పాత్ర పోషిస్తోంది. ఆధార్ అనేది గుర్తింపు సంఖ్య కాదు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరంగా ఓ ప్రామాణికం కూడా. కొత్తగా ఆధార్ పొందాలంటే ఆధార్ కేంద్రాలకు వెళ్లి క్యూ కట్టి గంటల తరబడి వేచి చూడాలి, మధ్యలో సర్వర్లు మొరాయిస్తే వెనుదిరగాల్సిందే. ఇక చిన్న పిల్లల ఆధార్ నమోదులో కష్టాలు అనేకం. ఆధార్ కేంద్రాలు పట్టణాలు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో మాత్రమే ఉండటంతో, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి ఇబ్బందుల నుంచి కొంత గట్టెక్కేందుకు ఆధార్ నమోదు ప్రక్రియను యూనిక్ ఐడెంటీఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ).. తపాలశాఖలోని ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీబీ) ద్వారా శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ప్రధాన పోస్టాఫీసులు, సబ్‌పోస్టాఫీసులు, బ్రాంచి పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో సేవలు ఇలా..

మంచిర్యాల జిల్లాలో జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాల కార్యాలయంతో పాటు, 24 సబ్‌పోస్టాఫీసులు, 141బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల హెడ్ పోస్టాఫీస్, లక్సెట్టిపేట, సీసీ, చెన్నూర్, రామకృష్ణాపూర్, కల్యాణిఖని, బెల్లంపల్లి సబ్‌పోస్టాఫీసు కార్యాలయాల్లో ఆధార్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండగా, జిల్లాలోని 141బ్రాంచి పోస్టాఫీసుల్లో బాల ఆధార్, (ఐదేళ్లలోపు పిల్లలకు)తో పాటు, అన్ని రకాల వయస్సుల వారికి ఆధార్‌తో ఫోన్ నంబర్ లింక్ చేసే సేవలు అందుబాటులో ఉంచారు.

జనన ధ్రువపత్రం తప్పనిసరి..

తపాల శాఖ ద్వారా చిన్న పిల్లలకు ఆధార్ కార్డు ఇవ్వాలంటే తప్పనిసరిగా జనన ధ్రువపత్రం ఉండాలి. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ సంఖ్యను కేటాయించేందుకు పోస్ట్‌మ్యాన్, జీడీఎస్‌లు వివిధ శాఖల సహకారం తీసుకుంటున్నారు. చైల్డ్ ఎన్‌రోల్‌మెంట్ లైట్(సీఈఎల్‌సీ) యాప్ ద్వారా ఆధార్ నమోదు చేస్తున్నారు. చిన్న పిల్లల వేలిముద్రలు స్పష్టంగా ఉండవనే ఉద్దేశంతో బయోమెట్రిక్ నుంచి మినహాయింపు నిచ్చారు. ఆధార్ నమోదు సమయంలో పిల్లల తల్లిదండ్రుల బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు. ఐదేళ్ల తర్వాత పిల్లల బయోమెట్రిక్ తీసుకుంటారు. బాలా ఆధార్‌కు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరి వేలిముద్రలు తీసుకున్నారో, వారి చిరునామాకు వారం రోజుల్లో ఆధార్ కార్డు జారీ అవుతుంది.

ఉచితంగానే బాల ఆధార్..

ఐదేళ్లలోపు చిన్నారులకు అందించే బాల ఆధార్‌కు ఎలాంటి రుసుము లేకుండా తపాల శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్నాం. బాలా ఆధార్ కోసం జిల్లాలోని 141బ్రాంచి పోస్టాఫీసుల్లో సేవలు అందుబాటులో ఉంచాం. అన్ని వయస్సుల వారి ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసందానించేందుకు మాత్రం రూ.50 రుసుము తీసుకుంటాం. సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– రామారావు, తపాలా శాఖ, ఏఎస్పీ, మంచిర్యాల

సంక్షిప్త వార్తలు

గన్రామ్‌పల్లికి బస్సు పునఃప్రారంభం

కాసిపేట: మండలంలోని గన్రామ్‌పల్లికి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును బుధవారం పునఃప్రారంభించారు. బస్సు ప్రారంభం సంతోషించదగ్గర విషయమని ప్రేంసాగర్‌రావుకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గన్రామ్‌పల్లి మాజీ సర్పంచ్ పేంద్రం రాజు, గ్రామ పటేళ్ల సిడాం గణ పతి, పేంద్రం ప్రభాకర్, ఆత్రం అచ్చుతరావు, సి డాం బాదు, ఆత్రం రాజు, కుడిమేత ఇ ద్రు, కాంగ్రెస్ నాయకులు కనకరాజు, మడావి అ నంతరావు, శంకర్, ఖాదర్, షకీల్ పాల్గొన్నారు.

మైత్రి యోగా ఆధ్వర్యంలో వాక్‌ఫర్‌యోగా

మంచిర్యాలటౌన్: పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని యోగా సంస్థలు మైత్రి యోగా ప్రకృతి చికిత్సా కేంద్రం, స్వామి వివేకానంద యోగా ట్రస్టు, ఓం అష్టోత్తర యోగా, బాయ్స్ హైస్కూల్ ఫిట్‌నెస్ సెంటర్, ఇతర స్వచ్ఛంద సంస్థలు బుధవారం యోగా ఫర్ వాక్‌ను నిర్వహించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు యోగా వాక్, యోగా ప్రదర్శనలు, విన్యాసాలు చేస్తూ అందరిలో ప్రేరణ, ఉత్సాహం కలిగించేలా నినాదాలు చేస్తూ యోగాపై అవగాహన కల్పించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి: భారత మెట్ట పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రీయ మెట్టపరిశోధన సంస్థ డైరెక్టర్ నర్సింహులు అన్నారు. మల్లంపేట గ్రామంలోని ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి మూడు కిలోల చొప్పున కందుల విత్తనాలను బుధవారం ఉ చితంగా అందజేశారు.

'గడ్డం కుటుంబానికి దళితులపై ఎందుకింత వివక్ష'

భీమారం: దళితులపై గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబానికి ఎందుకు ఇంత వివక్ష అని చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజారమేశ్ అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా నియోజకవర్గ అభివృద్ధిపై ఏమాత్ర దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజుకుమార్‌పై అక్రమంగా కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు సునీత, తిరుపతి రవి, ఎంపీపీ మంత్రి బాపు, పానుగంటి లక్ష్మణ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.